సాక్షి నిర్మల్

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



గులాబీ గెలుపు గుర్రాలు వీరే..

బీఆర్‌ఎస్ అభ్యర్థులను సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు సిట్టింగులకు చాన్స్ దక్కలేదు. వారిస్థానంలో కొత్తవారికి టికెట్ ఇచ్చారు. 8లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌ఖిల్లా: ధైర్య సాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు సంస్కృతి తదితర అంశాల్లో ప్రతిభ చూపిన బాలబాలికలకు 2023 సంవత్సరానికిగాను 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారా'లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖల అధికారి వైపీ.రమేష్ తెలిపారు. 18 సంవత్సరాలలోపు ఆసక్తి కలిగిన బాలబాలికలు http://awards.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8247685975 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.3 /24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా వానలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతీ పౌరుడికి పోలీస్ రక్షణ



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లాలోని ప్రతీ పౌరుడికి పోలీస్ రక్షణ ఉంటుందని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు తక్షణలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు నేరుగా గానీ, వాట్సాప్ నంబర్ 8712659599 ద్వారాగానీ సమాచారం ఇవ్వాలని వివరించారు.

సంపద వనం పనుల పరిశీలన



పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సంపద వనం పనులను డీఆర్డీవో విజయలక్ష్మి సోమవారం పరిశీలించారు. అనంతరం సంపద వనంలో మొక్కలను నాటారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంపద వనం పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూష, ఏఎంసీ డైరెక్టర్ మంగ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న స్వప్న

సోన్: తెలంగాణ రాష్ట్ర మిడిల్, లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ నిర్మల్ జిల్లా స్థాయి మీట్‌లో సోన్ కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థిని స్వప్న సత్తాచాటింది. అండర్ – 18 విభాగంలో పదో తరగతి చదువుతున్న స్వప్న ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ందని ప్రత్యేక అధికారి లత తెలిపారు. నిన్న హైదరాబాద్ గోల్కొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని 5వ స్థానంలో నిలిచిన స్వప్నను ప్రిన్సిపాల్ లత, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నేడు జిల్లాస్థాయి యోగా పోటీలు

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి అండర్ 14, 17 యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమణారావు తెలిపారు. ఈ పోటీలకు కన్వీనర్‌గా హెచ్ఎం ప్రేమ్‌దాస్, నిర్వహణ కార్యదర్శిగా పీఈటీ షేక్ ఇమ్రాన్ వ్యవరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, ఎలిజిబిలిటీ ఫాంను అంబారిపేట్ పాఠశాలలో అందజేయాలని తెలిపారు.

బాల రక్షభవన్ సందర్శన



స్వాగతం పలుకుతున్న సిబ్బంది

నిర్మల్‌ఖిల్లా: నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా సంక్షేమ అధికారి రమేష్ జిల్లా కేంద్రంలోని బాల రక్ష భవన్‌ను సోమవారం సందర్శించారు. జిల్లాలో బాలల సంరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ మహ్మద్ వాహిద్ తాము చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనాథ బాలల సంరక్షణ, బాల కార్మికుల నిర్మూలన, బాలలపై లైంగిక వేధింపుల నివారణ కోసం జిల్లాలో చేపట్టిన చర్యలను, విద్యాశాఖ, పోలీస్, కార్మిక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమసమితి సభ్యుడు స్వదేశ్ పరికిపండ్ల, నల్ల శ్రీలత, జన్ను అనిల్, సైమన్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

అంతా అనుకున్నట్టే..



మంత్రికి మొక్క అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్

- 'కారు' టిక్కెట్లు ఖరారు
- అల్లోల, విఠల్‌రెడ్డికి మళ్లీ చాన్స్
- రేఖానాయక్‌కు షాక్..
- ఖానాపూర్ టికెట్ జాన్సన్‌కు
- సీనియారిటీ, పాపులారిటీకే ప్రాధాన్యం
- ముధోల్‌లో అసమ్మతిని పట్టించుకోని సీఎం

నిర్మల్: కొన్నిరోజుల నుంచి ఊహిస్తున్నట్లే కారు పార్టీ టికెట్లు ఖరారయ్యాయి. సీనియారిటీతోపాటు ప్రజల్లో ఉన్న పాపులారిటీని పరిగణనలోకి తీసుకుని బీఆర్‌ఎస్ సోమవారం తమ అభ్యర్థులను ప్రకటించింది. నిర్మల్ సీటు మళ్లీ ఇంద్రకరణుడినే వరించింది. అసమ్మతిరాగం వినిపించినా ముధోల్ టికెట్ విఠల్‌రెడ్డికే దక్కింది. కొంతకాలంగా ఊహిస్తున్నట్లుగానే ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు షాక్ తప్పలేదు. ఆ స్థానాన్ని మారుస్తూ మంత్రి కేటీఆర్ మిత్రుడైన భూక్య జాన్సన్‌నాయక్‌కు ఇచ్చారు. మొత్తం మీద మూడు నియోజకవర్గాల్లో గులాబీశ్రేణులు ఆశించినట్లుగానే పార్టీ అధిష్టానం సీట్లు ఖరారు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాలుస్తూ, కేసీఆర్, కేటీఆర్‌లకు పాలాభిషేకాలు చేస్తూ, స్వీట్లు పంచుతూ సంబురాలు చేశారు.

అడ్డులేని 'అల్లోల'..

నిర్మల్ నియోజకవర్గం నుంచి ఎలాంటి పోటీ, అసమ్మతి వర్గాలు లేకుండా ఉన్న అల్లోలకే మళ్లీ పార్టీ పట్టం కట్టింది. రానున్న ఎన్నికల్లో తమ అభ్యర్థిగా ఇంద్రకరణ్‌రెడ్డిని ఖరారు చేసింది. సుదీర్ఘ రాజకీయ అనుభవంతోపాటు ఇప్పటికీ ప్రజల్లో ఆయనపై అభిమానం, విశ్వసనీయత ఉండటంతో పార్టీ అల్లోలకే టికెట్ ఇస్తోంది. వ్యక్తిగతంగా వయసు మీద పడుతున్నా.. ఇప్పటికీ ఎక్కడా తగ్గకుండా నిత్యం ప్రజల్లో ఉండటం, సమస్యల పరిష్కారంలోనూ చురుకుగా ఉంటారన్న పేరు రావడం, వీటన్నింటికీ తోడుగా అ టు సీఎం కేసీఆర్, ఇటు మంత్రి కేటీఆర్‌తోనూ సత్సంబంధాలు కలిగి ఉండటం అల్లోలకు కలిసివచ్చాయి.

గడ్డిగారికే మొగ్గు..

సిట్టింగ్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి టికెటిస్తే తామంతా పనిచేసేది లేదని కొంతకాలంగా ముధోల్‌లో అసమ్మతి రగులుతున్నా.. బీఆర్‌ఎస్ మాత్రం మళ్లీ గడ్డిగారివైపే మొగ్గు చూపింది. వరుసగా రెండుసార్లు గెలువడం, నియోజకవర్గంలో ఇప్పటికీ ఆయనపై నమ్మకం ఉండటం కలిసివచ్చింది. ఓసీ వర్గాలతోపాటు బీసీల్లో ప్రధానంగా మున్నూరుకాపులు సైతం ఆయనకు మద్దతు పలకడంతో పార్టీ విఠల్‌రెడ్డికే సీటిచ్చింది. ఇక్కడి నుంచి ఎమ్మెల్సీ దండె విఠల్‌తోపాటు సీనియర్లు రాజేశ్‌బాబు, సూర్యకాంత్‌రావు తదితరులు టికెట్ ఆశించారు. ప్రస్తుత బీజేపీ ప్రభావిత పరిస్థితుల్లో ముధోల్‌లో కొత్తప్రయోగం చేసే ఆలోచన పార్టీ చేయలేదన్నది స్పష్టమైంది. సౌమ్యుడిగా పేరున్న విఠల్‌రెడ్డి వైపే బీఆర్‌ఎస్ మొగ్గు చూపింది.

జాన్సన్‌కు జాక్‌పాట్..

ఖానాపూర్ నియోజకవర్గంలో అడుగుపెట్టిన అతితక్కువ సమయంలోనే భూక్య జాన్సన్ నాయక్ జాక్‌పాట్ కొట్టేశారు. తను అనుకున్నట్లుగానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సీటు దక్కించుకున్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌పై తీవ్రంగా ఉన్న వ్యతిరేకతే ఆయనకు పార్టీ పరంగా బలంగా మారింది. జగిత్యాల జిల్లాకు చెందిన జాన్సన్ మంత్రి కేటీఆర్‌కు దగ్గరి మిత్రుడు కావడం, ఆయన సామాజికవర్గానికి చెందిన ఓట్లు ఖానాపూర్ నియోజకవర్గంలో ఎక్కువగా ఉండటం కలిసి వచ్చింది. ప్రధానంగా మంత్రి కేటీఆర్ సపోర్ట్‌తోనే ఆయనకు టికెట్ వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

పుట్టకు మొక్కి.. పూజలు చేసి..



దేవత విగ్రహానికి పాలు పోస్తున్న మహిళలు

నిర్మల్‌టౌన్: నాగుల పంచమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మహిళలు పుట్టలో పాలు పోశారు. నైవేద్యాలు సమర్పించి నాగేంద్రునికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. నిర్మల్‌లోని ప్రియదర్శినినగర్, సెయింట్ థామస్ స్కూల్ ఆవరణలోని పుట్ట వద్ద, మినీ ట్యాంక్ బండ్ సమీపంలోని నాగదేవత ఆలయం, గండి రామన్న, మల్లన్న గుట్ట హరిహర క్షేత్రం భక్తులతో కిటకిటలాడాయి.



హారతి ఇస్తున్న మహిళా భక్తులు

రేఖానాయక్‌కు షాక్..

- టికెట్ తిరస్కరించిన బీఆర్‌ఎస్
- స్వయంకృతాపరాధమే కారణం?

నిర్మల్: ఖానాపూర్ ఎమ్మెల్యేగా రెండుసార్లు వరుసగా గెలిచిన అజ్మీరా రేఖానాయక్‌కు ఈసారి పార్టీ షాక్ ఇచ్చింది. ఊహించినట్లుగానే ఆమెకు రానున్న ఎన్నికల్లో పోటీచేసేందుకు పార్టీ టికెట్ ఇవ్వలేదు. ఆసిఫాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలిగా కాంగ్రెస్ నుంచి గెలిచిన ఆమె 2014లో టీఆర్‌ఎస్‌లో చేరారు. ముందుగా ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న రేఖానాయక్ అదే ఏడాది ఎన్నికల్లో కారుగుర్తుపై పోటీ చేసి గెలిచారు. గత ఎన్నికల సమయంలోనూ ఆమెపై వ్యతిరేకత వచ్చింది. కానీ సీఎం కేసీఆర్ స్వయంగా ఖానాపూర్‌వచ్చి రేఖను గెలిపించాలని, అభివృద్ధి పూచీ తనదని చెప్పారు. అలా రెండోసారీ గెలిచారు. కొంతకాలంగా ఎమ్మెల్యేపై ఖానాపూర్‌లో సొంతపార్టీ నేతలే అసమ్మతి వినిపిస్తున్నారు. అభివృద్ధిని పట్టించుకోవడం లేదంటూ ఆరోపణలు చేశారు. చాలాసార్లు మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్ వరకూ ఆమెపై ఫిర్యాదులు పంపారు. ఈక్రమంలో కేటీఆర్ తన మిత్రుడైన జాన్సన్ నాయక్‌కు రూట్ చూపించినట్లు పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. ఎమ్మెల్యే రేఖానాయక్ స్వయంకృతపరాధంతోనే సీటును కోల్పోయారన్న వాదన ఉంది.

ఆశావహులకూ నిరాశే..

ఖానాపూర్ ఎమ్మెల్యే సీటు ఈసారి ఎట్టిపరిస్థితుల్లో రేఖానాయక్‌కు రాదని, తామే బరిలో ఉంటామని పలువురు ఆశించారు. ప్రధానంగా రాజ్య సభ ఎంపీ సంతోష్‌కుమార్ అనుచరుడు బాదావత్ పూర్ణచందర్, ఆదిలాబాద్ జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ తమవంతు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ చివరకు జాన్సన్‌నాయక్‌కు టికెట్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిసిన తర్వాత, తాము లోకల్, ఆయన నాన్‌లోకల్ అన్న విషయాన్నీ ముందుకు తీసుకొచ్చారు. కానీ పార్టీ మాత్రం జాన్సన్‌నాయక్ వైపే మొగ్గుచూపింది.

మద్యం షాపు లక్కు.. ఇక ఆదాయం కిక్కు

- సజావుగా మద్యం దుకాణాల కేటాయింపు
- తక్కువ దరఖాస్తులు రావడంతో మూడు దుకాణాల డ్రా నిలిపివేత
- డ్రా తీసి విజేతలను ప్రకటించిన కలెక్టర్



విజేతలను ప్రకటిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: జిల్లాలో సోమవారం నిర్వహించిన కొత్త వైన్సుల కేటాయింపు డ్రా ప్రక్రియ సజావుగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి లక్కీడ్రా తీసి విజేతలను ప్రకటించారు. జిల్లాలో మొత్తం 47 షాపులు ఉండగా 4 దుకాణాలకు తక్కువ దరఖాస్తులు రావడంతో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆ దుకాణాల డ్రా తీయలేదు. జిల్లా కేంద్రంలోని 15 ,16, 17, భైంసా పట్టణంలోని 41నంబర్ షాపులను డ్రా నుంచి తప్పించారు. మిగతా 43 మద్యం దుకాణాలకు కలెక్టర్ ఒక్కొక్కటిగా డ్రా తీస్తూ విజేతలను ప్రకటించారు. 43 మద్యం దుకాణాల్లో 9 మంది మహిళలకు అదృష్టం వరించింది. డ్రాలో గెలుపొందిన అభ్యర్థులు ఎక్సైజ్ ధరావత్ ఫీజులో 1/6 శాతం ఫీజు మంగళవారం చెల్లించాలని అధికారులు సూచించారు. తక్కువ దరఖాస్తులు వచ్చిన షాపులకు మళ్లీ దరఖాస్తులను ఆహ్వానించి ప్రత్యేకంగా డ్రా తీస్తామని అధికారులు తెలిపారు. మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించినందుకు ఎక్సైజ్ శాఖను కలెక్టర్ అభినందించారు. ఇందులో ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సంపత్ కృష్ణ పాల్గొన్నారు.

పుట్టలో పాలు పోసిన సెకండ్ ఏఎన్‌ఎంలు



పుట్టలో పాలుపోసి మొక్కుతున్న ఏఎన్‌ఎంలు

నిర్మల్‌టౌన్: తమను రెగ్యులర్ చేయాలని జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట రెండో ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె సోమవారం 15వ రోజుకు చేరింది. నాగుల పంచమి పురస్కరించుకొని స్థానిక నాగదేవత ఆలయం ఆవరణలోని పుట్టలో పాలు పోసి తమను రెగ్యులరైజ్ చేసేలా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, తమకు ఎటువంటి పరీక్షలు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

మాస్టర్‌ప్లాన్ మార్చాలని బల్దియా తీర్మానం

- 'ఏలేటి' ఆమరణ దీక్షతో అత్యవసర సమావేశం
- కొత్త ప్లాన్‌కు పలు సూచనలు చేసిన కౌన్సిలర్లు
- తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: నిర్మల్ మాస్టర్‌ప్లాన్ అమలుకు సంబంధించి ప్రజాభిప్రాయాల సేకరణ మేరకు మార్పులు, చేర్పులు చేయాలని నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇటీవల చోటుచేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో సోమవారం అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. పలువురు కౌన్సిలర్లు కూడా మార్పులు, చేర్పులపై సూచనలు చేశారు. మంజులాపూర్ ప్రాంతంలోని కొన్ని సర్వే నంబర్లను ఇండస్ట్రియల్ జోన్ నుంచి తొలగించుటకు, 200 ఫీట్ల ఓఆర్ఆర్‌ను తీసివేసేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ విషయంలో రైతులెవరూ ఆందోళన చెందొద్దన్నారు. ప్రజాభిప్రాయాల సేకరణలో 591 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రైతులకు, ప్రజలకు నష్టం వాటిల్లకుండా మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని ఆదేశించారని తెలిపారు. ప్లాన్ పూర్తిగా రద్దు చేయడం కుదరదని ప్రజలకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికే మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దీక్ష చేపట్టారని విమర్శించారు. మాస్టర్ ప్లాన్‌పై ఆయనకు అవగాహన లేదన్నారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారి, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు తీర్మానం కాపీ..

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ పూర్తిగా రద్దు చేయాలని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం కొనసాగింది. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట పలువురు రైతులు దీక్షలో కూర్చున్నారు. మున్సిపల్‌లో కౌన్సిల్ తీర్మానం చేసిన తర్వాత సదరు కాపీని చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తీసుకుని వచ్చి రైతులకు అందించారు. రైతుల అభ్యంతరాల మేరకు మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు రైతులు రిలే నిరాహార దీక్ష కొనసాగించాలా.. విరమించాలా.. అనేదానిపై తుదినిర్ణయాన్ని వెల్లడించలేదు. మాస్టర్‌ప్లాన్‌లో తమకు వ్యతిరేకంగా ఉన్న అంశాలపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని పలువురు రైతులు కోరారు.

కోట్లు కొల్లగొట్టేందుకే మంత్రి 'ప్లాన్'

- రాష్ట్రం దృష్టిని ఆకర్షించిన 'ఏలేటి' పోరు
- బీఆర్‌ఎస్ ఏజెంట్లలా పోలీసులు
- కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- అర్ధరాత్రి దాటిన తర్వాత 'ఏలేటి'ని ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- పరామర్శించి దీక్ష విరమింపజేసిన బీజేపీ స్టేట్ చీఫ్



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి, పక్కన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, నాయకులు

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ రద్దుకోసం బీజేపీ పోరాడుతున్న తీరు, ఆమరణ దీక్ష చేపట్టిన మహేశ్వర్‌రెడ్డి పోరు రాష్ట్రం దృష్టిని ఆకర్షించిందని, కోట్లు కొల్లగొట్టేందుకే మంత్రి అల్లోల 'మాస్టర్‌ప్లాన్' వేశారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. రాంజీగోండు, కొమురంభీం స్ఫూర్తితో అవినీతి సర్కారుపై పోరాడుదామన్నారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని పరామర్శించేందుకు సోమవారం జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. ఆయనను పరామర్శించి, మున్సిపల్‌లో మాస్టర్‌ప్లాన్‌పై తీర్మానం చేసిన విషయాన్ని తెలుసుకుని దీక్ష విరమింపజేశారు. లాఠీచార్జీలో గాయపడిన నాయకులు, కార్యకర్తల దగ్గరకు వెళ్లి పరామర్శించారు. పోలీసులు బీఆర్‌ఎస్ ఏజెంట్లలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డి ఇంట్లోని దీక్షాశిబిరంలో మాట్లాడారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆయన బంధువులు మాస్టర్‌ప్లాన్‌ను అడ్డుపెట్టుకుని, తమకు అనుకూలంగా మలుచుకుని కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. పచ్చని పొలాల్లో ఇండస్ట్రియల్ జోన్ ఎలా ఇస్తారని, అలాగే పారిశ్రామిక ప్రాంతాన్ని రెసిడెన్షియల్‌గా ఎలా మారుస్తారని ప్రశ్నించారు. మాస్టర్‌ప్లాన్‌లో నష్టపోతున్న బాధితుల పక్షాన మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేసిన పోరును అభినందించారు. లాఠీచార్జీలను ఖండిస్తూ, పోలీసుల తీరుపై మండిపడ్డారు.

వేకువజామున ఆస్పత్రికి..

ఆరురోజులుగా ఆమరణదీక్షలో ఉన్న మహేశ్వర్‌రెడ్డిని సోమవారం వేకువజామున 3 గంటలకు పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఒక్కసారిగా ఏలేటి ఇంటిని చుట్టుముట్టారు. బలవంతంగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు సెలైన్లు పెట్టి, చికిత్స అందించారు. అయినా తన నిరాహారదీక్షను మహేశ్వర్‌రెడ్డి కొనసాగించారు.

లాఠీ దెబ్బలకు భయపడకుండా..

జిల్లాకేంద్రంలో వారం రోజులుగా మాస్టర్‌ప్లాన్ రద్దు కోసం పోరాడుతున్నామని, చివరకు ఆమరణదీక్ష చేపడితేగానీ రాష్ట్ర ప్రభుత్వం దిగిరాలేదని మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేసిన ఆందోళనపై రెండురోజులు వరుసగా లాఠీచార్జీ చేయించారని మండిపడ్డారు. చరిత్రలో ఎప్పుడూ ఇలా నిర్మల్‌లో లాఠీచార్జీ చేయలేదన్నారు. లాఠీదెబ్బలు తిన్న కార్యకర్తలు, నాయకులు మొక్కవోని ధైర్యంతో పోరాడారని కొనియాడారు. ఎంఐఎం, కాంగ్రెస్‌ల తొత్తుగా బీఆర్‌ఎస్ మారిందన్నారు. ఎంఐఎం ఓవైసీలను సంతోషపెట్టేందుకు బీజేపీపై లాఠీచార్జీ చేయించిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో గెలిచిన తర్వాత తమ పాలనలో పోలీసుల సంగతి చూస్తామన్నారు. నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కాషాయజెండా నిర్మల్‌లో ఎగరేసే వరకు కలిసికట్టుగా పోరాడుతామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ పార్లమెంట్ ప్రభారీ అల్జాపూర్ శ్రీనివాస్, పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, ఆదిలాబాద్ నాయకురాలు సుహాసినిరెడ్డి, రామారావుపటేల్, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, పల్లె గంగారెడ్డి, సామ రాజేశ్వర్, మెడిసెమ్మె రాజు, నాయిడి మురళి, సాదం అరవింద్, తక్కల రమణారెడ్డి, ముత్యంరెడ్డి, సత్యం చంద్రకాంత్, నరేశ్, తాలోడ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన కార్యకర్తను పరామర్శిస్తున్న కిషన్‌రెడ్డి

జిల్లా ఓటర్లు 6,83,848

నిర్మల్: జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన ఓటర్ల సంఖ్య తేలింది. మొత్తం 6,83,848 మంది ఓటర్లు ఉన్నారు. ఈమేరకు సోమవారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్పెషల్ సమ్మరీ రివిజన్ జాబితాలను ఎన్నికల అధికారులు విడుదల చేశారు. రానున్న ఎన్నికల వరకు అంటే దాదాపు అక్టోబర్ వరకు ఈ జాబితాలో మార్పులు, చేర్పులు కొనసాగనున్నాయి. ఎన్నికల ముందు వచ్చే ఫైనల్ జాబితా వరకు ఇదే తుది జాబితాగా కొనసాగనుంది.

నిర్మల్‌లో అధికం..

జిల్లాలో నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే నిర్మల్ అధికసంఖ్యలో ఓటర్లు నమోదయ్యారు. ఇక్కడ ఎనిమిది మండలాలకుగానూ మొత్తం 2,37,575 మంది ఓటర్లు ఉన్నారు. ముధోల్ నియోజకవర్గంలో ఏడు మండలాలతో పాటు నర్సాపూర్(జి) మండలంలోని పలు గ్రామాలు కలిపి మొత్తం 2,36,130 మంది ఓటర్లు ఉన్నారు. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన ఖానాపూర్‌లో ఎనిమిది మండలాలకు గానూ 2,10,143మంది ఓటర్లు ఉన్నారు.

మహిళలదే పైచేయి..

జిల్లాలో జనాభాతోపాటు ఓటరు జాబితాలోనూ మహిళలోకానిదే పైచేయి కొనసాగుతోంది. జిల్లాలో మొత్తం పురుష ఓటర్లు 3,30,834 మంది ఉండగా, మహిళలు 3,52,036మంది ఉన్నారు. ఈలెక్కన జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళ ఓటర్లు 21,202 మంది ఎక్కువగా ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లోనూ మహిళలదే పైచేయిగా ఉంది. ట్రాన్స్‌జెండర్లు జిల్లాలో 45మంది ఉండగా, ఆర్మీ తదితర దేశ రక్షణ విభాగాల్లో పనిచేస్తున్న సర్వీస్ ఓటర్లు 933మంది ఉన్నట్లు జాబితాలో వెల్లడించారు.

ఓటర్ల జాబితా వివరాలు..


నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
నిర్మల్	1,12,612	1,24,706	14	243	2,37,575
ముధోల్	1,15,000	1,20,840	18	272	2,36,130
ఖానాపూర్	1,03,222	1,06,490	13	418	2,10,143
మొత్తం	3,30,834	3,52,036	45	933	6,83,848

గులాబీ గెలుపు గుర్రాలు వీరే..

• బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్‌
• జిల్లాలో ముగ్గురు సిట్టింగ్‌లకు దక్కని టికెట్‌ • అభ్యర్థుల నేపథ్యం ఇదీ..

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో బీఆర్‌ఎస్‌ దూకుడు పెంచింది. అందరికంటే ముందుగానే పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌ అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ముగ్గురు సిట్టింగులకు చాన్స్‌ దక్కలేదు. వారిస్థానంలో కొత్తవారికి టికెట్‌ ఇచ్చారు. నియోజకవర్గాల వారీగా మొత్తం పది మంది అభ్యర్థుల రాజకీయ నేపథ్యం ఇలా ఉంది..

నిర్మల్‌ నియోజకవర్గం

పేరు : అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
తల్లిదండ్రులు : నారాయణరెడ్డి, చిన్నమ్మ
భార్య : విజయలక్ష్మి
కూతురు, అల్లుడు : పల్లవిరెడ్డి, రంజిత్‌రెడ్డి
కుమారుడు, కోడలు : గౌతమ్‌రెడ్డి, దివ్యారెడ్డి
పుట్టినతేదీ : 16–02–1949
విద్యార్హత : బీకాం, ఎల్‌ఎల్‌బీ
రాజకీయ ప్రస్థానం


- 1987లో జరిగిన పరిషత్‌ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా పరిషత్‌ చైర్మన్‌గా వ్యవహరించారు.
- 1991లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 1999, 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 2008 పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి 2009 వరకు ఆదిలాబాద్‌ ఎంపీగా ఉన్నారు.
- 2014లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా గెలిచి సెప్టెంబర్‌ వరకు రాష్ట్ర గృహనిర్మాణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రిగా కొనసాగారు.
- 2018నుంచి రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

ఆసిఫాబాద్‌ నియోజకవర్గం




పేరు : కోవ లక్ష్మి
భర్త : సోనేరావ్‌
తండ్రి : కోట్నాక్‌ భీంరావ్‌ (గిరిజన సంక్షేమశాఖ మాజీమంత్రి)
తల్లి : భీంబాయి
కులం : ఎస్టీ(గోండు)
పుట్టిన తేదీ : 6–2–1969
విద్యార్హత : పదోతరగతి
సంతానం : కుమార్తెలు అరుణ (సిర్పూర్‌(యూ) జెడ్పీటీసీ, మాన్విత, కుమారుడు సాయినాథ్‌
రాజకీయ ప్రస్థానం : 1995, 2001లో తిర్యాణి మండలం పంగిడిమాదర నుంచి ఎంపీటీసీ
2002 : తిర్యాణి ఎంపీపీగా
2006 ఆసిఫాబాద్‌ సర్పంచ్‌
2010 : టీఆర్‌ఎస్‌(ప్రస్తుత బీఆర్‌ఎస్‌)లో చేరిక
2013 : రెండోసారి ఆసిఫాబాద్‌ సర్పంచ్‌గా ఎన్నిక
2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్‌ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
2018 : ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు.
2019 : జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక

సిర్పూర్‌(టి) నియోజకవర్గం

పేరు : కోనేరు కోనప్ప
తల్లిదండ్రులు : సూర్య నారాయణ, కృష్ణవేణి
కులం : ఓసీ (కమ్మ)
పుట్టిన తేదీ : 07–10–1955
విద్యార్హత: ఇంటర్‌
భార్య: రమాదేవి
పిల్లలు : కూతురు ప్రతిమ, కుమారుడు వంశీకృష్ణ
నివాసం : గుంటూరు కాలనీ, కాగజ్‌ నగర్‌
రాజకీయ ప్రస్థానం :
1999 : కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.
2004 : కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.
2009 : కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
2014 : బీఎస్పీ నుంచి గెలుపుపొంది టీఆర్‌ఎస్‌లో చేరారు.
2018 : టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.

చెన్నూర్‌ నియోజకవర్గం




పేరు: బాల్క సుమన్‌
తల్లిదండ్రులు: బాల్క సురేశ్, ముత్తమ్మ
కులం: మాల
పుట్టినతేదీ: 18–10–1983
భార్య : రాణి అలేఖ్య
కుమారులు : సుహాన్, సుషన్‌
స్వస్థలం : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం, రేగుంట
విద్యాభ్యాసం: డిగ్రీ
రాజకీయ ప్రస్థానం :

- 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. 2007లో టీఆర్‌ఎస్వీ ఓయూ అధ్యక్షుడిగా, 2010లో టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2009 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు.
- 2014లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి టీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ప్రత్యర్థి కాంగ్రెస్‌ అభ్యర్థి గడ్డం వివేకానందపై 2.91 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్‌ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్‌ అభ్యర్థి బోర్లకుంట వెంకటేశ్‌ నేతపై 28,132 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుతం చెన్నూర్‌ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు.

బెల్లంపల్లి నియోజకవర్గం




పేరు: దుర్గం చిన్నయ్య
తల్లిదండ్రులు: దుర్గం రాజయ్య, మల్లక్క
భార్య:జయతార
సంతానం: ఇద్దరు కూతుర్లు (నిహారిక , విహారిక)
కులం: ఎస్సీ (నేతకాని)
పుట్టినతేదీ: 31–05–1972
విద్యార్హత: డిగ్రీ, బీఏ
స్వస్థలం: జెండా వెంకటాపూర్, నెన్నెల (మం) వృత్తి:వ్యవసాయం
నివాసం: మంచిర్యాల
రాజకీయ ప్రస్థానం

- 1995 లో టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా రాజకీయ రంగప్రవేశం.
- 1995 లో నెన్నెల జెడ్పీటీసీగా టీడీపీ నుండి పోటీచేసి విజయం సాధించారు.
- 2001లో టీడీపీ నుండి జంగాల్‌పేట్‌ ఎంపీటీసీగా గెలిచి నెన్నెల ఎంపీపీగా గెలిచారు.
- 2009 లో టీఆర్‌ఎస్‌లో చేరిక
- 2011లో బీఆర్‌ఎస్‌ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.
- 2014 లో చిత్తాపూర్‌ ఎంపీటీసీగా టీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి బెల్లంపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

ముధోల్‌ నియోజకవర్గం




పేరు : గడ్డిగారి విఠల్‌రెడ్డి
తల్లిదండ్రులు : గడ్డెన్న, రాజమ్మ
పుట్టినతేదీ : 06–08–1954
పుట్టిన ఊరు : దేగాం, భైంసా మండలం
విద్యార్హత : బీఏ, ఎల్‌ఎల్‌బీ
భార్య : గడ్డిగారి లక్ష్మి
కూతురు, అల్లుడు : సులోచన, శ్రీనివాస్‌రెడ్డి
కుమారుడు, కోడలు : రాంరెడ్డి, అక్షయ
రాజకీయ ప్రస్థానం

- 2006 నుంచి 2008 వరకు భైంసా మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా చేశారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పీఆర్పీ నుంచి పోటీ చేసి కేవలం 183 ఓట్లతో ఓడిపోయారు.
- 2010 నుంచి 13వరకు మరోసారి భైంసా మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా చేశారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 2014 ఆగస్టు 6న బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి రెండోసారి బంపర్‌ మెజార్టీతో గెలిచారు.

మంచిర్యాల నియోజకవర్గం




పేరు : నడిపెల్లి దివాకర్‌రావు
తల్లిదండ్రులు: రమాదేవి, లక్ష్మణ్‌రావు
భార్య: రాజకుమారి
కుమారులు: రంజిత్, విజిత్‌కుమార్‌
స్వస్థలం: పాతమంచిర్యాల
పుట్టినతేదీ : 15 ఆగస్టు, 1952
విద్యార్హత : బీఏ(పొలిటికల్‌ సైన్స్‌)

- 1981లో మంచిర్యాల మున్సిపల్‌ కౌన్సిలర్‌
- 1987లో మంచిర్యాల సింగిల్‌ విండో చైర్మన్‌
- 1982–1992 వరకు మంచిర్యాల బ్లాక్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి
- 1999 వరకు బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా పనిచేశారు
- 1999 అసెంబ్లీ ఎన్నికల్లో లక్సెట్టిపేట నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.
- 2015 నుంచి 2018 వరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ అండర్‌ టేకింగ్స్‌ కమిటీ చైర్మన్‌గా కొనసాగారు.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి టీఆర్‌ఎస్‌ నుంచే పోటీచేసి విజయం సాధించారు.

ఆదిలాబాద్‌ నియోజకవర్గం




పేరు :జోగు రామన్న
తల్లిదండ్రులు: జోగు ఆశన్న, భోజమ్మ
భార్య : రమ
కుమారులు : ప్రేమేందర్, మహేందర్‌
స్వగ్రామం : దీపాయిగూడ, జైనథ్‌ మండలం
విద్యార్హత : బీఏ
రాజకీయ ప్రస్థానం..

- 1984లో టీడీపీలో చేరిక
- 1988 నుంచి 1995 వరకు దీపాయిగూడ సర్పంచ్‌గా, మండల పరిషత్‌ ఉపాధ్యక్షునిగా పనిచేశారు.
- 1995 నుంచి 2001 వరకు జైనథ్‌ ఎంపీపీగా..
- 2001 నుంచి 2009 వరకు జైనథ్‌ జెడ్పీటీసీగా
- 2004 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి ఓడిపోయారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2010లో తెలంగాణ నగారా సమితిలో చేరిక
- 2011లో టీఆర్‌ఎస్‌లో చేరి 2012 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు.
- 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరించారు.
- 2019 సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

బోథ్‌ నియోజకవర్గం




పేరు : అనిల్‌జాదవ్‌
తల్లిదండ్రులు : యశోద, జాదవ్‌ రామారావు
భార్య : హరిప్రియ
కుమారులు :ఆర్యన్, అర్జున్‌
పుట్టినతేదీ : 16–06–1972
స్వస్థలం: రాజురా
మండలం: నేరడిగొండ
నియోజకవర్గం: బోథ్‌ (ఎస్టీ)
విద్యార్హతలు :బీఏ, పొలిటికల్‌ సైన్స్‌
రాజకీయ ప్రస్థానం:

- 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక, 2004 ఎన్నికలలో టికెట్‌ ఆశించారు. చివరి నిమిషంలో సోయం బాపురావు పార్టీలో చేరి టికెట్‌ దక్కించుకోవడంతో టీఆర్‌ఎస్‌ పార్టీలో ఉండి 'సోయం' గెలుపు కోసం కృషి చేశారు.
- 2007 లో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు.
- 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.
- 2018లో ఇండిపెండెంట్‌గా అభ్యర్థిగా పోటీ
- 2019 మార్చి 21న బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2019లో జరిగిన పరిషత్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి నేరడిగొండ జెడ్పీటీసీగా విజయం సాధించారు.

ఖానాపూర్‌ నియోజకవర్గం




పేరు : భూక్య జాన్సన్‌ నాయక్‌
తల్లిదండ్రులు : భూక్య శామ్యూల్‌నాయక్, కేస్లీబాయి
పుట్టినతేదీ : 06–06–1976
భార్య : జయలక్ష్మి
సంతానం : కుమారుడు
విద్యార్హత : జెనిటిక్స్‌లో డిగ్రీ, కంప్యూటర్‌ అప్లికేషన్స్‌లో పీజీ డిప్లొమా
పుట్టిన ఊరు: తిమ్మాపూర్‌ తండా, మం.ఇబ్రహీం పట్నం, జి.జగిత్యాల
రాజకీయ ప్రస్థానం
2009లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. 2014లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంపీ టికెట్‌కోసం ప్రయత్నాలు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

EDUCATION
DIRECT FINAL YEAR

■ Direct Final Year: Discontinued (or) Fail Degree, P.G., LL.B, B.Tech, M.Tech, B.Sc, M.Sc అగ్రి, నర్సింగ్‌ BPT, MPT, P.hd. Cell: 9951627996, 8885404396 [W-785649]

WANTED

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, వార్డ్‌బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్‌ : 9391036931, 9246585901 [HA-12052]

■ హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్‌ : 9640258899, 9640468899 [HA-189323]

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్‌ /క్లర్క్స్‌ / అటెండర్స్‌ / ఆఫీస్‌ అసిస్టెంట్స్‌ / అకౌంటెంట్స్‌/ క్యాషియర్స్. Q: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7531]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి

• ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌


పీవోను సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్‌ నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌ అన్నారు. నాగులపంచమి పురస్కరించుకుని సోమవారం ఆలయంలో పూజలు చేశారు. మెస్రం వంశీయులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రకార మండపం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ముత్నూర్‌ నుంచి కేస్లాపూర్‌ బీటీ రోడ్డు మరమ్మతు పనులు చేపడుతామన్నారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, ఆలయ కమిటీ చైర్మన్‌ మెస్రం తుకారం, మెస్రం వంశం ఉద్యోగులు మనోహర్, శేఖర్‌బాబు, దేవ్‌రావ్, మెస్రం వంశం పెద్దలు బాదిరావ్, కోసేరావ్‌ కటోడ, కోసేరావ్, దేవ్‌రావ్, నాగ్‌నాథ్‌ ఉన్నారు.

ఆ అధికారి తిట్ల పురాణమే !

• కిందిస్థాయి ఉద్యోగులకు తీవ్ర వేధింపులు
• విచారణ చేపడుతామన్న రిమ్స్‌ డైరెక్టర్‌

ఆదిలాబాద్‌టౌన్‌: ఎన్ని విమర్శలు వచ్చినా..అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ ఆ అధికారి తీరులో మార్పు రావడం లేదు. కిందిస్థాయి ఉద్యోగులంటే ఆమెకు చులకన అనే రీతిలో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రిమ్స్‌లో పనిచేసే ఆ అధికారి గతంలో సిబ్బందిని వేధింపులకు గురిచేయడం, తన జన్మదినం సందర్భంగా వారి నుంచి కానుకలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై 'రిమ్స్‌లో కలెక్షన్‌ క్వీన్‌ 'అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా, అప్పట్లో కలెక్టర్‌ విచారణ జరిపారు. కాగా ఇటీవల కాలంలో మళ్లీ ఆ అధికారి అదేరీతిలో వ్యవహరిస్తున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. సమస్యలు విన్నవించేందుకు వెళ్లినా తిట్ల పురాణంతో ఉతికి ఆరేస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేకపోవడం, ఆ అధికారి బంధువులు వైద్య శాఖలో పనిచేస్తుండడం, వారి అండదండలతో ఇలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. మహిళా సిబ్బందిని సైతం దుర్భాషలాడుతుండడంతో వారు కంటతడి పెడుతున్నారు. సోమవారం కొందరి సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషించడంతో కన్నీరుమున్నీరైనట్లు తెలిసింది. ఈ విషయం రిమ్స్‌ డైరెక్టర్‌ దృష్టికి వెళ్లగా, ఆ అధికారిని పిలిచి ఆరా తీసినట్లు తెలిసింది. ఇలాంటివి మరోసారి పునరావృతమైతే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా కొందరు సిబ్బంది మూకుమ్మడిగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ విషయమై రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌ను వివరణ కోరగా, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని వివరించారు.

ఫోన్‌ తీసుకున్నాడని అనుమానంతో హత్య

• యువకుడిని రాళ్లు, కర్రలతో కొట్టి..
• బేల మండలంలో ఘటన


కొడపే జీవన్‌(ఫైల్‌)

బేల: ఫోన్‌ తీసుకున్నాడని అనుమానంతో యువకుడిని హత్య చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రాధిక కథనం ప్రకారం.. మండలంలోని మశాల(కె), దుబ్బగూడ(ఎం) గ్రామాల మధ్యన అటవీ ప్రాంతంలోని భవానీగూడ(ఇ) గ్రామానికి చెందిన కొడపే జీవన్‌(25) ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన లింగ్‌షాతో జీవన్‌కు పరిచయం ఉంది. తన ఫోన్‌ పోయిందని, ఆ ఫోన్‌ను తీసుకున్నాడని అనుమానంతో జీవన్‌ను రెండు రోజుల క్రితం చితకబాదాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న జీవన్‌ను కూలీ పని కోసమని చెప్పి లింగ్‌షాతోపాటు దుబ్బగూడ (ఎం) గ్రామానికి చెందిన భీంరావు బైక్‌పై తీసుకెళ్లారు. అటవీప్రాంతంలో ఫోన్‌ ఇవ్వాలని వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో వీరిద్దరితోపాటు బోరిగాంకు చెందిన దేవ్‌షా, శ్రీనులు జీవన్‌ను రాళ్లు, కర్రలతో చితకబాది హత్య చేశారు. ఈ విషయాన్ని గ్రామస్తుడు గోడం కిశోర్‌ రాత్రి జీవన్‌ తమ్ముడు విజయ్‌కు చెప్పాడు. విజయ్‌ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

ఇంద్రవెల్లి: నాగుల పంచమి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని కేస్లాపూర్‌ నాగోబా ఆలయానికి భక్తులు తరలిరావడంతో మినీ జాతర తలపించింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి పూజలు చేశారు. గంటల తరబడి లైన్‌లో ఉండి నాగోబాను దర్శనం చేసుకున్నారు. కేస్లాపూర్‌ గ్రామాభివృద్ధి కమిటీ, మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ కమిటీ చైర్మన్‌ మెస్రం తుకారం, సర్పంచ్‌ మెస్రం రేణుకనాగ్‌నాథ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోట్నాక్‌ బారిక్‌రావ్, నాగోబా యూత్‌ అధ్యక్షుడు మెస్రం శేఖ్‌నాథ్‌ ఉన్నారు.


మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


నాగోబా విగ్రహానికి భక్తుల పూజలు


భక్తజనసంద్రంగా మారిన ఆలయ ప్రాంగణం


రంగుల రాట్నాల వద్ద యువకుల సందడి

అల్లోల హ్యాట్రిక్‌ విజయం కోసం పొర్లుదండాలు


ఆలయం చుట్టూ జగన్‌ పొర్లుదండాలు

దిలావర్‌పూర్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హ్యాట్రిక్‌ విజయం సాధించాలని ఆయన అనుచరుడు, ఉద్యమకారుడు డాక్టర్‌ జగన్‌ పొర్లుదండాలతో మొక్కు తీర్చుకున్నాడు. సోన్‌ మండల కేంద్రానికి చెందిన డాక్టర్‌ జగన్‌ కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని పాపహరేశ్వరాలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. జిల్లాను ఎంతో అభివృద్ధి చేసిన మంత్రి అల్లోల మరోసారి విజయం సాధిస్తారని జగన్‌ ధీమా వ్యక్తం చేశాడు. ఆలయ కమిటీ చైర్మన్‌ నార్వాడి వెంకట్రావు, సంభాజీరావు, నాయకులు ఉన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

• ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు

ఉట్నూర్‌రూరల్‌: గిరిజన అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్‌ పేర్కొన్నారు. ఉట్నూర్‌ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎం అండ్‌హెచ్‌ఓ కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్‌ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

- గేదెల కొనుగోలు కోసం రుణం మంజూరు చేయాలని తలమడుగు మండలం ఝరి గ్రామానికి చెందిన కాశీరాం అర్జీ సమర్పించాడు.
- తనకు ఆశ్రమ పాఠశాలలో ప్రవేశం కల్పించాలని ఉట్నూర్‌ మండలం లక్సెట్టిపేట గ్రామానికి చెందిన అనసూయ అర్జీ అందించింది.


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

- తనకు ఆర్థికసాయం అందించాలని సారంగపూర్‌ మండలం చించోలి గ్రామానికి చెందిన ఆత్రం భీందాస్‌ విన్నవించాడు.
- ఖానాపూర్‌ మండలం సత్తన్‌పల్లి గ్రామానికి చెందిన బోడ గణేశ్‌ తనకు కిరాణ దుకాణం మంజూరు చేయాలని కోరారు.
- పింఛన్, డబుల్‌ బెడ్రూం, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల్లో సమస్యలు పరిష్కరించాలని పలు అర్జీలు వచ్చాయి.